A1TV NEWS

నేటి ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

APTEL 2023/16425

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 140 గురువారం 14 డిసెంబర్ 2023 పేజీలు 4. వెల :4 /



## లోక్ సభలో ఇద్దరు దుండగుల

# కలకలం... గ్యాస్ లీక్..

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 23: లోక్ సభలో నేడు దాడి జరగడం పట్ల స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు.. నిండు సభలో జరిగిన దాడి పూర్తిగాభద్రతా వైఫల్యంగా భావిస్తున్నామని, దానికి తానే బాధ్యత వహిస్తానని పేర్కొన్నారు.దాడి అనంతరం తిరిగి ప్రారంభమైన లోక్ సభలో భద్రతా వైఫల్యంపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు.. దీనిపై చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టారు.. దీనిని ఆయన సమాధానం చెబుతూ, "లోక్‌సభ లోపల ఇద్దరు దుండగులు, బయట మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నాం. వారి దగ్గరున్న వస్తువులను స్వాధీనం చేసుకున్నాం. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతాం. ఆ పూర్తి బాధ్యత నాదే. నిందితులు వదిలింది కేవలం సాధారణ పొగే అని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయితే, నిందితులు వదిలిన గ్యాస్ ఏమిటనే దానిపై సమగ్ర విచారణ జరుపుతాం. దీనిపై ఈ సాయంత్రం సమావేశం నిర్వహిస్తాం. సభ్యుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటాం" అని వెల్లడించారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే.. సభ సజావుగా నిర్వహించడం మనందరి బాధ్యత అని స్పీకర్ అన్నారు. **మిగతాది 2లో...**

## స్కిల్ కేసులో జగన్ సర్కార్

# కీలక నిర్ణయం..!



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 13: ఏపీలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్నట్లు చెబుతున్న స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ స్కాం కేసులో వైసీపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఇప్పటివరకూ సీఐడీతో దర్యాప్తు చేయిస్తూ విపక్ష నేత చంద్రబాబును జైలుకు పంపిన వైసీపీ సర్కార్.. ఇప్పుడు అంతకు మించిన నిర్ణయం తీసుకుంది. తాజాగా స్కిల్ స్కాంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టులో కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిల్ పై వైసీపీ సర్కార్ తన అభిప్రాయం చెప్పేసింది.

ఏపీ స్కిల్ స్కాంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిల్ పై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు ఏపీ ప్రభుత్వం అభిప్రాయం కోరింది. దీనిపై స్పందించిన వైసీపీ సర్కార్.. స్కిల్ స్కాంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో దర్యాప్తు చేయించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టులో అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. దీంతో ఈ వ్యవహారం ఎన్నికల ముందు కాక రేపేలా కనిపిస్తోంది.

స్కిల్ స్కాంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిల్‌పై ఇవాళ జరిగిన విచారణ తర్వాత హైకోర్టు దీన్ని మరోసారి వాయిదా వేసింది. అయితే ఈ కేసులో పిటిషనర్ అయిన ఉండవల్లి అరుణ్ కుమార్ ఓ కీలక అంశాన్ని హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో కొందరు ప్రతివాదులను నోటీసులు అందలేదని, మరికొందరు నోటిసులు తీసుకొనేందుకు ఇష్టపడటం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణలో న్యూస్ పేపర్ ద్వారా ప్రతివాదులకు నోటీసులు పంపే అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. అలాగే ఉండవల్లి దాఖలు చేసిన ఈ కేసులో తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది

## నాణ్యమైన విద్య వైద్యం ప్రజలకు అందించడం

# ప్రభుత్వ బాధ్యత

-వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద అర్హులకు రూ. 25 లక్షల వరకూ చికిత్స ఉచితం. -ఈ నెల 18న ప్రారంభోత్సవం.. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్.



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 13: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అర్హులైన వారికి వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకూ ఉచిత చికిత్స కార్యక్రమాన్ని చేపట్టింది. ఎవరికి ఎలాంటి వైద్యం అవసరమైనా రూ.25 లక్షల వరకూ చికిత్స ఉచితంగా లభిస్తుందన్న భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో కార్యక్రమం సాగాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు హక్కుగా అందించాలనే లక్ష్యంతో అత్యంత మానవీయ దృక్పథంతో అడుగులు వేస్తోందని సీఎం జగన్ పేర్కొన్నారు. **మిగతాది 3లో...**

## టిడిపి ఎన్నికల వ్యూహకర్తగా

# ప్రశాంత్ కిషోర్..?



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 13: వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధించాలనే సంకల్పంతో తెలుగుదేశం పార్టీ ఉంది. అందుకనుగుణంగా అధికారంలోకి రావడానికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూ వస్తోంది. ఈ క్రమంలోనే జనసేనతో పొత్తు ఖరారైంది. దీనితర్వాత ఆ పార్టీ మరో అడుగు ముందుకేసింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారకుడైన ఎన్నికల వ్యూహకర్త, ఐప్యాక్ అధినేత ప్రశాంత్ కిషోర్ తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు కొన్ని మీడియా సంస్థలతోపాటు సోషల్ మీడియాలో వార్త వైరల్ గా మారింది.

గత ఎన్నికల్లో సామాజిక తంత్రాన్ని ఉపయోగించి వైసీపీ అధికారంలోకి రావడానికి పీకే దోహదపడ్డారు. ఆ సమయంలోనే అతన్ని ఎన్నికల వ్యూహకర్తగా నియమించుకోవడానికి తెలుగుదేశం పార్టీ ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేకపోయింది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీద్వారా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అప్పట్లోనే పీకేను కలిశారు. అప్పటికే బీహార్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి జనసురాజ్ పేరుతో పాదయాత్ర చేస్తుండటంతో ఎన్నికల సమయంలో సేవలందిస్తానని ప్రశాంత్ కిషోర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీకి రాబిన్ శర్మ టీం వ్యూహకర్తగా వ్యవహరిస్తోంది. గతంలో పీకే టీంలోనే రాబిన్ శర్మ పనిచేశారు. ఇటీవలే హైదరాబాద్ లో ప్రశాంత్ కిషోర్ తో రాబిన్ శర్మ సమావేశమైనట్లు తెలుస్తోంది. చంద్రబాబు అరెస్ట్ సమయంలో ఎక్కువ రోజులు ఢిల్లీలోనే ఉన్న నారా లోకేష్ ఆ సమయంలో కూడా పీకేను కలిసినట్లు సమాచారం. అప్పటి నుంచే రాష్ట్రంలో పీకే టీం, రాబిన్ శర్మ టీం కలిసి పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పీకే తన మనసు మార్చుకొని తెలుగుదేశం పార్టీకి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు అరెస్ట్, తదనంతర పరిణామాల తర్వాత.. ఏపీలో రాబిన్ శర్మతో కలిపి వ్యూహాలు ప్రారంభించినట్లు సమాచారం. అయితే ఈ విషయం పార్టీ శ్రేణులకు తెలియకపోవడం గమనార్హం. రాబిన్ శర్మ టీంలో తన బృందాన్ని కలిపి కథ నడిపిస్తున్న పీకే టీడీపీని అధికారంలోకి తీసుకువస్తారా? లేదా? అన్నది తెలియాలంటే వేచి చూడాల్సి ఉంది.

# ఏపీలో కాంగ్రెస్ చూపు షర్మిల వైపు..?

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 13: రెండు తెలుగు రాష్ట్రాలలో పట్టు కోసం కాంగ్రెస్ పార్టీ గత కొన్నాళ్లుగా గట్టిగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఎట్టకేలకు హస్తం పార్టీ ప్రయత్నాలు ఫలించి తెలంగాణలో అధికారంలోకి వచ్చింది.ఇక మిగిలింది ఏపీనే. ఇక్కడ కూడా పూర్వ వైభవం పొందాలని కాంగ్రెస్ గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. 2014 తరువాత ఏపీలో హస్తం పార్టీ పూర్తిగా కనుమరుగైంది. ఆ తరువాత కాంగ్రెస్ కు చెందిన చాలామంది నేతలు ఇతర పార్టీలలో సెటిల్ అయ్యారు.ఇప్పుడు హస్తం పార్టీ ఏపీలో పూర్వ వైభవం పొందాలంటే కింది స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాల్సివుంటుంది. మరి ఆ స్థాయిలో పార్టీని బలపరిచే నేత కాంగ్రెస్ లో ఉన్నారా ఎవరు లేరనే చెప్పాలి.అందుకే కాంగ్రెస్ హైకమాండ్ ఏపీ విషయంలో వైఎస్ షర్మిల వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ వేళ తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయాలని భావించినప్పటికి.. కుదరకపోవడంతో కేవలం మద్దతు వరకే సరిపెట్టుకుంది షర్మిల.





అయితే కాంగ్రెస్ అధిష్టానం మాత్రం షర్మిల విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వినికిడి. తెలంగాణలో కంటే ఆమె పాత్రను ఏపీలోనే వినియోగించుకోవాలని చూస్తున్నట్లు టాక్. ఇటీవల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఏపీ కాంగ్రెస్ లోకి షర్మిల వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పడంతో కాంగ్రెస్ హైకమాండ్ ఆలోచన ఎలా ఉందో ఇట్టే అర్థమౌతుంది. ఏపీలో మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ఈ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రచార కర్తగా షర్మిలకు బాద్యతలు అప్పగించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకపోతే ఏపీలో ఇకనుంచి అడపాదడపా రాహుల్ గాంధీ మరియు ప్రియాంకాగాంధీ కూడా పర్యటించే ఆలోచనలో ఉన్నారట. ఇలా ఓవరాల్ గా ఏపీ కాంగ్రెస్ కార్యాచరణ అంతా కూడా షర్మిల మీదనే ఉంచేలా అధిష్టానం ముందడుగు వేస్తున్నాట్లు జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. మరి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఏపీలో ఎలా పట్టు సాధిస్తుందో చూడాలి.

# లోక్ సభ లో ఇద్దరు దుండగుల కలకలం.. గ్యాస్ లీక్.

కాగా, లోక్‌సభలో ప్రశ్నోత్తర సమయంలో లోక్‌సభలో ఇద్దరు దుండగులు కలకలం సృష్టించారు%ొ% సందర్శకులు కూర్చునే గ్యాలరీ నుంచి ఓ వ్యక్తి సభలోకి దూకగా.. మరో వ్యక్తి గ్యాలరీ వద్ద ఒకరకమైన గ్యాస్‌ను వదిలి భయభ్రాంతులకు గురిచేశాడు. అదే సమయంలో పార్లమెంట్ భవనం వెలుపల మరో ఇద్దరు రంగుల పొగలు వదిలారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఈ నలుగుర్ని అరెస్టు చేశారు. కాగా, ఈ గ్యాస్ కేవలం రంగు వెదజల్లుతుందని, దీని వల్ల ఎటువంటి ప్రమాదం లేదని లోక్ సభ భద్రతా సిబ్బంది ప్రకటించారు.

ఆ ఇద్దరు దుండగులను సాగర్ శర్మ, మనోరంజన్ డి గా గుర్తించారు. అధికారులు వారి వివరాలు వెల్లడిస్తూ.. నిందితులు మైసూర్–కొడగు ఎంపీ ప్రతాప్ సింహ ద్వారా పార్లమెంట్ లోకి ప్రవేశించడానికి పాస్ లు పొందారని సమాచారం. నిందితులను శంకర్ లాల్ శర్మ కుమారుడు సాగర్ శర్మ, డి దేవరాజ్ కుమారుడు డి మనోరంజన్ (35)గా గుర్తించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వెలుపల అదుపులోకి తీసుకున్న వారిలో మహిళ నీలంగా , యువకుడు అమోల్ షిండేగా గుర్తించారు. దుండగుల గురించి పోలీసు వర్గాలు పరిమిత సమాచారాన్ని విడుదల చేశాయి. అయితే, మనోరంజన్ మైసూరుకు చెందినవాడనీ, మైసూర్ వివేకనంద యూనివర్సిటి లో కంప్యూటర్ సైన్సెస్ లో గ్రాడ్యుయేట్ అని సమాచారం.

కాగా , ఈ నలుగురు సిఫార్స్ లేఖలు పొందిన ఆ ఎంపిని కూడా అధికారులు ప్రశ్నిస్తున్నారు.. దీనిపై సమగ్ర ప్రకటన త్వరలోనే విడుదల చేస్తామని స్పీకర్ ప్రకటించారు.. ఈ ఇద్దరు నిందితులు దాడి చేసిన సమయంలో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు మధ్య ప్రదేశ్, చత్తీస్ గడ్ పర్యటనలో ఉన్నారు.. దాడి విషయం తెలిసిన వెంటనే ప్రధాని హోం కార్యదర్శికి, పార్లమెంట్ భద్రతా దళం చీఫ్ కు ఫోన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు..

పాత పార్లమెంట్ భవనంపై ఉగ్రదాడి జరిగి 22 ఏళు ్ల పూర్తయింది. వాజ్ పేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో 2001 డిసెంబర్ 13వ తేదిన జరిగింది.. ఆ సంఘటన జరిగి సరిగ్గా 22 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా మోడీ ప్రభుత్వంలో ఈ దాడి జరగడం సంచలనం సృష్టించింది.

22 సంవత్సరాల క్రితం కూడా ఇదే రోజున పార్లమెంట్ పై దాడి జరిగింది. యావత్ దేశాన్ని కదిలించిన భయంకరమైన ఉగ్రదాడిని చూసింది. 2001 డిసెంబరు 13న జరిగిన ఆనాటి భయానక ఘటన ఇప్పటికీ దేశ ప్రజల మదిలో మెదులుతూనే ఉంది. అదే రోజు మళ్లీ నేడు పార్లమెట్ లో గ్యాస్ దాడి కలకలం రేపుతోంది. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలైన లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం)లకు చెందిన ఐదుగురు ఉగ్రవాదులు హోం మంత్రిత్వ శాఖ, పార్లమెంట్‌కు చెందిన నకిలీ పత్రాలతో చొరబడ్డారు. ఎకె 47 రైఫిళు ్ల, గ్రెనేడ్ లాంచర్లు, పిస్టల్స్, గ్రెనేడ్‌లతో ఉగ్రవాదులు పార్లమెంటు ప్రాంగణం చుట్టూ మోహరించిన భద్రతా వలయాలను ఛేదించారు. వారు కారును లోపలికి నడిపించగా, సిబ్బందిలో ఒకరైన కానిస్టేబుల్ కమలేష్ కుమారి యాదవ్‌కు వారి కదలికపై అనుమానం వచ్చింది. అయితే ఉగ్రవాదులు యాదవ్‌పై కాల్పులు జరిపారు. దాదాపు 11 సార్లు కాల్పులు జరిపారు. . యాదవ్‌ను హతమార్చిన తర్వాత ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ ముందుకు సాగారు. దాదాపు 30 నిమిషాల పాటు జరిగిన ఈ భయానక ఘటనలో మొత్తం తొమ్మిది మంది మృతి చెందగా, 18 మంది గాయపడ్డారు.

మొత్తం ఐదుగురు ఉగ్రవాదులను కూడా భవనం బయటే మట్టుబెట్టారు. దేశ రాజధానిలో ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, ఇతర తీవ్రమైన నేరాలను నిరోధించడం, గుర్తించడం, దర్యాప్తు చేయడం కోసం 1986లో ఏర్పాటైన ఢిల్లీ పోలీస్ యాంటీ టెర్రర్ యూనిట్ స్పెషల్ సెల్ దర్యాప్తు బాధ్యతలు చేపట్టింది. 22 ఏళ్ల నాటి ఉగ్రదాడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నేడు పార్లమెంటో లో చర్చ సాగుతున్న తరుణంలో మరోసారి ఇలా గ్యాస్ దాడి జరగడం సంచలనం కలిగిస్తోంది.




## నంద్యాల చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభ ను జయప్రదం చేయండి.

పట్టణంలోని
చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో గౌరవ అధ్యక్షులు ఆకుమల్ల రహీమ్ ,అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా అధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశం లో ఏకగ్రీవం గా తీసుకున్న నిర్ణయం మేరకు డిసెంబర్ 18 సోమవారం నాడు శోభ లాడ్జి ప్రక్కన ,సిటీ కేబుల్ ఆఫీస్ వద్ద గల చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యాయంలో నంద్యాల జిల్లా మహా సభ నిర్వహించు కొనుటకు నిర్ణయం తీసుకోవడం జరిగినది.కావున నంద్యాల పట్టణము లోని చిరు వ్యాపారులు అనగా ,తోపుడు బండ్లు పై వ్యాపారం చేసుకొనువారు,బుట్టలు పైన వ్యాపారం చేయువారు మరియు ఫుట్ పాత్ ల పై వ్యాపారం చేసుకోను చిరు వ్యాపారులు అందరూ కూడా చిన్న వ్యాపారులే కావున వీరందరూ ఎక్కువ సంఖ్య లో హాజరై మహా సభను జయప్రదం చేయవలసిందిగా కోరారు.మన చిరు వ్యాపారుల అనేక సమస్యల పరిష్కారం కోసం మన ఐక్యత చాలా అవసరం.రోజువారీ గేట్లు ఎత్తివేత,వడ్డీలేని రుణాలను మంజూరు చేసుకోవడం, చిరువ్యాపారులు గౌరవంగా వ్యాపారం చేసుకునే విధముగా ప్రభుత్వ స్థలం కేటాయించడం మరియు సొంత ఇండ్లు లేని వారికి ప్రభుత్వం చే ఇండ్లు కట్టించుకో వడం తదితర సమస్యలు సాధించుకోవాలని మన చిరు వ్యాపారులు అందరూ ఇక్యమత్యం తో ఉంటే సాడించుకోవచ్చు.కావున పైన తెలిపిన అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ సంఖ్య లో హాజరై మహా సభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్య క్రమం లో అధ్యక్షుడు,సత్యనారాయణ గుప్తా,గౌరవ అధ్యక్షులు ఆకుమల్ల రహీమ్, ప్రధాన కార్యదర్శి మదార్ వలి, కోశాధికారి నారాయణ,ఉపాధ్యక్షులు సంజీవ రాజు, సభ్యులు నబిరసూల్, మోదిన్ , తిరుమలేశు,ఆటోనగర్ వాసు, ఎన్జీవోస్ కాలనీసాయి , ఆచారి ,రాముడు,తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యకు పరిష్కారం.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ డిసెంబర్ 13: మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలలో పైప్ లైన్ రిపేర్ రావడంతో మంచినీటి ఎద్దడితో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం గ్రామ పంచాయితీ సర్పంచ్ దూదేకుల హుస్సేన్ బి కి సమాచారం రావడంతో తక్షణమే పైప్ లైన్ ని మరమ్మతులు చేసి విద్యార్థులకు మంచినీటి కొరత తీర్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ దుదేకుల హుస్సేన్ బి గురప్ప మాట్లాడుతూ.. ప్రజల సమస్య దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య పంచాయతీ పరిధిలో ఎక్కడ రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు , గ్రామంలో ఏ సమస్య ఉన్న గ్రామ ప్రజలు తప్ప కుండా సమాచారం తనకు ఇవ్వాల్సిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వెంటనే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నా వంతుగా ఆ సమస్య ను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తానని , ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్పోర్ట్స్ అంబాసిడర్లకు ఆహ్వాన పత్రిక.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 13:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నంద్యాల జిల్లా స్పోర్ట్స్ అంబాసిడర్లకు ఆహ్వాన పత్రికను అందజేసిన జాయింట్ కలెక్టర్ శ్రీ టి రాహుల్ కుమార్ రెడ్డినంద్యాల జిల్లాలోని అంతర్జాతీయ స్థాయి, జాతీయస్థాయి మరియు రాష్ట్రస్థాయి క్రీడాకారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు ఇందులో సెటిల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుడు అయిన ఎస్.కె హర్షద్ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం జరిగింది. బాల్ బ్యాడ్మింటన్ వాలీబాల్, కబడ్డి,ఖో ఖో, క్రికెట్ ఐస్ స్కేటింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. నంద్యాల జిల్లా స్పోర్ట్స్ బ్రాండ్ అంబాసిడర్ లందరూ ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్లో అతిథులుగా వ వ్యవహరించనున్నారు. భారతదేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్రములోని గ్రామ సచివాలయం స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్ర పోటీలను క్రికెట్ వాలీబాల్ కబడ్డీ కోకో బ్యాట్మెంటన్ క్రీడాంశాలలో నిర్వహించనున్నారు.

# జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటనను విజయవంతం చేయండి.

### -జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య.



నంద్యాల డిసెంబర్ 13:– ఈనెల 14వ తేదీన నంద్యాల జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి . పుల్లయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగ్లవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో పర్యటించనున్న కేంద్ర కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై జిల్లా రెవిన్యూ అధికారి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య మాట్లాడుతూ 14వ తారీఖున జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించే సమయంలో జిల్లాలోని కరువుకు సంబంధించిన సమాచారాన్ని బృందానికి వివరించాలన్నారు. డ్వామా పీడీ బృందానికి లైజనింగ్ ఆఫీసర్ గా ఉండి జిల్లాలోని కరువు ప్రాంతాల్లో కవర్ అయ్యేలా చూడాలని. డ్వామా కు సంబంధించిన పనులను డ్వామా పిడి చూపించాలని, వాటర్షెడ్ కు సంబంధించిన వర్క్స్ కూడా చూపించాలని, నిర్ణీత సమయంలోనే కరువు బృందాన్ని రిసీవ్ చేసుకోవాలన్నారు. సమాచార శాఖ వారు కరువు బృందం పర్యటనకు సంబంధించి వ్యవసాయ శాఖ, వారి సహకారంతో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. %ూ జు% ఆర్డబ్ల్యూస్, వారు వాటర్ రిసోర్స్ గురించి తెలియచేయాలని, లు వారి వారి ప్రాంతంలోని పర్యటన విజయవంతం అయ్యేలా చూడాలని జిల్లా రెవిన్యూ అధికారి ఆదేశించారు. వ్యవసాయ శాఖ వారు అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సిపిఓ, అర్ డబ్ల్యు ఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహానంది ఆలయానికి 59.34 లక్షల ఆదాయం.

ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 13:



మహానంది ఆలయానికి59.34 లక్షల రూపాయల ఆదాయం బుధవారం హుండీ లెక్కించగా వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయానికి 40 రోజుల్లో కార్తీక మాసాన్ని కలుపుకొని ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున ఏఈఓ మధు ఆలయ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చెయ్యడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్న సైబర్ నేరగాళు

### -క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ లింక్ లను పంపిస్తున్న సైబర్ నేరగాళ్లు, క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ.

### -ఫేస్బుక్, వాట్సాప్ మరియు ఇతర సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతున్న మెసేజ్స్ కు స్పందించకండి, తెలియని లింకులను క్లిక్ చేయవద్దు.

### -సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండ జాగ్రత్త పడండి. -నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 13:

క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల గురించి నంద్యాల జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చెయ్యడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని, పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని, కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలు, లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దని,చిన్నగా %వి%500 అమెజాన్ గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండని వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొల్పుతుందని, ఆ లింక్‌పై క్లిక్ చేస్తే అసలు వెబ్‌సైట్‌లా కనిపించే క్లోన్ చేసిన వెబ్‌సైట్ తెరవబడుతుందని, మీ వ్యక్తిగత వివరాలు.. మీరు ఇచ్చుకుంటూ పోయిన తరువాత, మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. కావున ఎటువంటి పరిస్థితిలలోను అపరిచితుల నుంచి వచ్చిన లింక్ లపై క్లిక్ చేయవద్దని, అదేవిధంగా మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దని, ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత బ్యాంక్, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు మరియు మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చెయ్యాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు.

# ఓటర్ లిస్టులో పేర్లు, ఫోటోలు మార్పులు చేర్పులు.

ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 13:



ఓటర్ లిస్టులో పేర్లు మరియు ఫోటోలు మార్పులు చేర్పులపై బి ఎల్ వో లకు మహానంది మండల తాసిల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం తాసిల్దార్ జనార్ధన్ శెట్టి నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ వివిధ మండలాల్లో ఒక వ్యక్తి రెండు మూడు గ్రామాల్లో ఓటరుగా నమోదు చేసుకున్నారని ఫిర్యాదులు ఉన్న సందర్భంలో వారు ఓటరుగా ఏ గ్రామంలో ఉంటారో వాటి వివరాలు సేకరించి మిగిలిన గ్రామాల్లో ఓటర్లు జాబితాలో ఉన్న పేర్లను తొలగించాలని ఆదేశాలు జారి చేశారు. దీంతోపాటు పేరు ఒకరిది ఫోటో మరొకటి ఉన్న వాటిని కూడా గుర్తించి అలాంటి వాటిని తొలగించి వెంటనే సంబంధిత ఓటరు జాబితాలో అర్హులైన వారి ఫోటోలు పేర్లు సక్రమంగా ఉండే విధంగా నమోదు చేయాలని సూచించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఎన్నికల నిబంధన మేరకు ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మరియు ఇతర అధికారులు బిఎల్వోలు పాల్గొన్నారు.

# అభ్యర్థుల మార్పుతో వైసిపిలో అలజడి..!

## -విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.
## -మొత్తం 65 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు మార్పు.

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 13:
తిరుగులేని జనాదరణతో 151సీట్లతో 2019లో అధికారాన్ని చేజిక్కించుకున్నవైసిపికి 2024లో ఎదురే ముంది అనకుంటున్న నేతలకు ఒక్కసారిగా కుదుపు.
ఉన్నట్టుండి ఇంత మందిని మార్చేస్తారా అని వాళ్లు అనుకుంటున్నారు. కానీ ఇది జస్ట్ శాంపిల్ మాత్రమే. అసలు సంగతి ముందుంది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. మొత్తం 65 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు మారబో తున్నారు.
రెండు-మూడు జిల్లాలకే 11మందిని మార్చేస్తే..
మిగిలిన చోట్ల పరిస్థితి ఏంటన్న ఆందోళన ఇప్పుడు ఎమ్మెల్యేల్లో మొదలైంది.
ఇచ్ఛాపురం మొదలుకుని కుప్పం వరకూ పార్టీ నేతల్లో టెన్షన్ మొదలైంది.ఎవరు ఇన్.. ఎవరు అవుట్.
ఎవరికి ట్రాన్స్ఫర్ అన్న చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. మార్చడమైతే ఖాయమన్న మెసేజ్ ఇప్పటికే ఎమ్మెల్యేలకు అంతర్గతంగా వెళ్లిపోయింది. అందుకే కొంతమంది సైలంట్ గా ఉంటే.. మరి కొంత మంది పక్క చూపులు చూస్తున్నారు. పార్టీలోని ముఖ్యుల నుంచి అందిన సమాచారం మేరకు 65 స్థానాల్లో అభ్యర్థులు మారుతుతున్నారు.
ఇందులో 40 మందిని పూర్తిగా పక్కన పెడుతుండగా.. మరో 25చోట్ల జంబ్లింగ్ చేయబోతున్నారు.
వైస్సార్సీపీ అధినేత జగన్మోహనరెడ్డి కోసం ఐపాక్ టీమ్ పనిచేస్తున్న విషయం తెలిసిందే కదా.. ఈ సంస్థ గ్రౌండ్ లెవల్లో చేసిన సర్వేల్లో పార్టీ పరిస్థితి బాగాలేదన్న రిపోర్టు వచ్చింది. కనీసం 70స్థానాల్లో ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలింది. ఐదు చోట్ల స్థానికంగా ఉన్న గొడవలను సర్దుబాటు చేసి మిగిలిన 65చోట్ల అభ్యర్థులను మార్చాలన్న నిర్ణయానికి జగన్ వచ్చేశారు. ఈ నిర్ణయం జరిగి కూడా నెలరోజులకు పైగానే అవుతోంది. కొంతమంది ఎమ్మెల్యేలకు ఈ మెసేజ్ను ఎప్పుడో చేరవేశారు కూడా విడతల వారీగా ఇప్పుడు అభ్యర్థులను మారుస్తూ వస్తున్నారు.
గుంటూరులో మంత్రి విడుదల రజనీని చిలకలూరిపేట నుంచి గుంటూరు వెస్ట్కు తీసుకొచ్చారు.అయితే చివరి నిమిషం వరకూ అది కూడా డౌటే అంటున్నారు.. పేటలో తీవ్ర వ్యతిరేకత ఉండటంతో తాత్కాలికంగా వెస్ట్ కు తీసుకొచ్చినట్లు చెబుతున్నా.. అది జస్ట్ స్టేజింగ్ మాత్రమే. ఇప్పటికే రేపల్లె, వేమూరు, ప్రత్తిపాడు, తాడికొండ, చిలకలూరిపేట, మంగళగిరి, గుంటూరు వెస్ట్ స్థానాలకు అభ్యర్థులను మార్చేశారు. పొన్నూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి కూడా మార్చే అవకాశాలున్నాయి.
అంబటికి ఆల్రెడీ చెప్పేసినట్లు చెప్పుకుంటున్నారు.
ధర్మాన బ్రదర్స్ కు మళ్లీ టికెట్లు దక్కే అవకాశం ఉంది. అయితే ధర్మాన మాత్రం తాను రాజకీయాల నుంచి విరమిస్తానని కుమారుడికి అవకాశం ఇమ్మని చెబుతున్నారు. టెక్కలి టికెట్ కోసం కిల్లి కృపారాణి మంతనాలు చేస్తున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం విషయంలో వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఆయన నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందని..అలాగని మరో అభ్యర్థిని అక్కడ పెట్టే అవకాశం కూడాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
బొత్స సత్యనారాయణను ఎంపీగా పంపించాలనే యోచన ఉంది.బొబ్బిలి,ఎస్ కోటలో అభ్యర్థులను మార్చాలన్న డిమాండ్ ను పరిశీలిస్తున్నారు.
విశాఖ జిల్లాలో చాలా మార్పులు జరగ బోతున్నాయి.నియోజకవర్గ సమన్వయ కర్తగా తొలగించడంతో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు పార్టీకి రాజీనామా చేశారు.
మళ్లీ అలాంటిదేమీ లేదన్నారు.అక్కడ వరికూటి రామచంద్రరావుకు బాధ్యతలు ఇచ్చారు.
మంత్రి అమరనాథ్కు అప్పగించాలని చూసినా ఆయన ఆసక్తి చూపలేదు.
అమరనాథ్ను పెందుర్తి నుంచి నిలబెట్టబోతున్నారు.
అనకాపల్లి నుంచి ఎంపీ సత్యవతికి టికెట్ ఇచ్చే అవకాశం ఉంది.
అరకు స్థానానికి కూడా అభ్యర్థిని మారుస్తున్నరు.
ఉమ్మడి తూర్పు గోదావరిలో
మంత్రి చెల్లుబోయినకు టికెట్ లేదన్న విషయాన్ని ఇప్పటికే కన్ఫామ్ చేశారు.
ఆయనను ఎమ్మెల్యేగా ఎక్కడా నిలబెట్టే పరిస్థితి లేదు.
రాజమండ్రి ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ కోరుతోంది.
రాజమండ్రి ఎంపీ భరత్ను రాజమండ్రి అర్బన్ అసెంబ్లీ నుంచి పోటీ చేయించాలన్న ఆలోచనలో ఉన్నారు.
మాజీమంత్రి కన్నబాబును కూడా కాకినాడ ఎంపీ స్థానం నుంచి పోటీచేయాలని చెబుతున్నారు.
అమలాపురం ఎంపీ అనురాధకు అమలాపురం అసెంబ్లీ స్థానం దక్కే అవకాశం ఉంది.
కాకినాడ ఎంపీ వంగా గీతకు పిఠాపురం సీటు కేటాయించనున్నారు.
కోనసీమ నుంచి మంత్రిగా ఉన్న విశ్వరూప్ ను పక్కన పెడుతున్నారు.
ఆయన కుమారుడుకి విశాఖ జిల్లా పాయకరావుపేట సీట్ కేటాయించే అవకాశాన్ని చూస్తున్నారు.
పశ్చిమ గోదావరిలో పార్టీ పరిస్థితి బాగా లేదన్న విషయాన్ని పార్టీ గుర్తించింది. నర్సాపురం పార్లమెంట్ స్థానంలోని అన్ని అసెంబ్లీ సీట్లలో ఇబ్బందికర పరిస్థితే ఉంది.ఇక్కడ చాలా మార్పులు జరిగే అవకాశం ఉంటుంది.లేదా ఎలాగూ గెలవరు అని తెలిస్తే.. పాత వాళ్లని కొనసాగించొచ్చు.
మాజీమంత్రి ఆళ్ల నానికి కూడా ఏలూరులో ప్రత్యామ్నాయాన్ని చూస్తున్నారు. కృష్ణా జిల్లాలో మల్లాది విష్ణు, వెల్లంపల్లి కి సీట్లు కష్టమే. జోగి రమేష్ కు కూడా ఎమ్మెల్యే సీటు లేదని చెప్పేసినట్లు సమాచారం. ఆయన్ను ఏలూరు నుంచి ఎంపీగా పోటీ చేయించాలన్న ఆలోచనతో ఉన్నారు. ఇక తెలుగుదేశం నుంచి వచ్చిన ఫైర్ బ్రాండ్ లీడర్ గన్నవరం వంశీ కొంతకాలంగా సైలంట్ అయిపోయారు. ఆయనకు సీటు లేదని చెప్పడమే కారణమట. పెనమలూరు నుంచి పార్థసారథిని గన్నవరం తెచ్చి.. వంశీని పెనమలూరు వెళ్లాలని చెప్పినట్లు సమాచారం.వంశీ యాక్టివ్గా లేకపోవడానికి ఇదే కారణమని భావిస్తున్నారు.



ప్రకాశం జిల్లాలో వైసీపీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోంది. వైవీ సుబ్బారెడ్డి ఇన్చార్జిగా ఉన్నప్పుడు..ఇబ్బందులు ఉన్నాయనుకుంటే..
విజయసాయిరెడ్డి వచ్చాక పరిస్థితి మరింత జఠిలంగా మారిపోయిందంట.
తెలుగుదేశం వాళ్లంతా కలిసికట్టుగా పనిచేస్తుంటే..
ఇక్కడ వైసీపీ మాత్రం తలో దిక్కు అయిపోయింది.
బాలినేని పూర్తిగా దూరంగా జరగడం.. ఎన్నికల టైమ్ కు ఏం చేస్తారో తెలీక పోవడంతో ఇక్కడ పరిస్థితి అర్థం కావడం లేదు. ఇపప్టికే అద్దంకి, సంతనూతలపాడు, కొండేపి సీట్లలో మార్పులు జరిగాయి.
నెల్లూరు జిల్లాలో అనిల్ కు టికెట్ లేదన్న విషయం కన్ఫామ్ చేసేశారు.గూడురు ఎమ్మల్యే వరప్రసాద్,కావలి సీట్లలో కూడా మార్పులు జరుగుతున్నాయి. చివరి నిమిషంలో మరిన్ని మార్పులు ఉండ బోతున్నాయి.
చిత్తూరు జిల్లాలో స్థానికంగా వ్యతిరేకత ఎదుర్కొంటున్న రోజాను పక్కన పెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆమెను పార్టీ ప్రచారకర్తగా వాడుకోవాలను కుంటున్నారు.
శ్రీకాళహస్తి ఎమ్మెల్యేను మార్చడం ఖాయం. ఆయన స్థానంలో రోజా అభ్యర్థిత్వాన్ని పరిశీలించే అవకాశం ఉంది.
డిప్యూటీ సీఎంకు నారాయణస్వామికీ టికెట్ నిరాకరిస్తున్నారు.పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లి ఇలా అన్ని చోట్లా కాండిడేట్లు మారిపోతున్నారు.
అనంతపురం జిల్లాలో మంత్రి ఉషశ్రీ చరణ్ కు సీటు ఇవ్వడం లేదు.ఎమ్మెల్యే తిప్పేస్వామికి నో చెప్పేశారు. కదిరిలోనూ మార్పు ఉంటుంది.
సీఎం సొంత జిల్లా కడపలో ఆయన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డికి నో అనేశారు.జమ్మలమడుగు , డిప్యూటీ సీఎం అంజాద్ భాషా ప్రాతినిధ్యం వహిస్తున్న కడప అర్బన్ సీట్లలోనూ కాండిడేట్లు మారిపోతారు.
జమ్మల మడుగు నుంచి అవినాష్ పోటీ చేసే అవకాశం ఉంటుంది. ఆయన కాని పక్షంలో మరొకరికి సీటు ఇస్తారు.
కర్నూలు జిల్లాలో
కర్నూలు జిల్లాలో మంత్రి జయరాంకు సీటు లేదన్న విషయాన్ని స్పష్టం చేశారు. ఆరోపణలు ఎన్ని ఉన్నా.. ఆ సామాజిక వర్గం నుంచి కాండిడేట్లు లేరన్న కారణంతో కొనసాగించారు. ఈసారి ఎమ్మెల్యే టికెట్ కూడా నిరాకరిస్తున్నారు.
అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కర్నూలుకు రప్పించే అవకాశం ఉంది.
మొత్తం మీద 65 స్థానాల్లో అభ్యర్థులు మారడం అనేది మాత్రం పక్కా.ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించి నందున ముందు ముందు ఇలాంటి లిస్టులు మరిన్ని బయటకు వచ్చే అవకాశం ఉంది. మార్పులకు కారణం ఏంటో పార్టీ నేతలే నేరుగా చెబుతున్నందున దీనిపై పెద్దగా చర్చ కూడా ఏం లేదు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను మారుస్తున్నామని చెబుతున్నారు కాబట్టి పాత అభ్యర్థులతో వెళితే ఈ సీట్లలో ఓడిపోతారని అర్థం చేసుకోవాలి.
అయితే ఈ మార్పులు వైస్సార్సీపీలో కాస్త అలజడిని సృష్టిస్తున్నాయి.
మంగళగిరి టికెట్ నిరాకరించడంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీకి, ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చెప్పేశారు. సీటు వస్తుందని ఆశించిన డొక్కా మాణిక్య వరప్రసాద్ ఇప్పుడు బయట పార్టీవైపు చూస్తున్నారు.
సీనియర్ ఎమ్మెల్యే సుధాకరబాబునూ పక్కన పెట్టేశారు.
చాలా మంది మంత్రులను పక్కన పెడుతున్నారు.
వాళ్లంతా జగన్ కు సన్నిహితులు కావడంతో ఏం అనలేని పరిస్థితి.

# నాణ్యమైన విద్య వైద్యం ప్రజలకు అందించడం ప్రభుత్వ బాధ్యత- సీఎం జగన్

తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ బుధవారం నాడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ ఆరోగ్య శ్రీ వైద్య సేవల పరిమితిని రూ. 25 లక్షలకు పెంచిన అనంతరం సీఎం జగన్ అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. వైయస్సార్ ఆరోగ్య శ్రీ కార్డు ఉందంటే.. ఆ వ్యక్తికి రూ.25 లక్షలు వరకూ వైద్యం ఉచితంగా లభిస్తుందని వివరించారు. ఆరోగ్యం, విద్య అన్నవి ప్రజలకు ఒక హక్కుగా లభించాలని, ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని పేర్కొన్నారు. అందుకనే అధికారంలోకి వచ్చిన రోజునుంచే ప్రభుత్వం ఈ అంశాలపై విశేష కృషి చేసిందని, వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వంచేస్తున్న ఖర్చులే దీనికి ఉదాహరణ అని సీఎం జగన్ పేర్కొన్నారు.
ప్రజలకు ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా సరే వైయస్సార్ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ లో చికిత్స చేయించుకున్న వారికి మళ్లీ డాక్టర్ దగ్గరకు వెళ్లి చెకప్ చేయించుకునేందుకు(ఫాలో అప్ కన్సల్టేషన్) రవాణా ఛార్జీల కింద రూ.300 చెల్లించాలని సమీక్షలో సీఎం ఆదేశించారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో రోగులుగా గుర్తించిన వారికి ఆస్పత్రులకు వెళ్లేందుకు రూ.500లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అన్నదానిపై రూపొందించిన వీడియోను అందరికీ పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహా ప్రజలందరికీ కూడా ఈ వీడియోను అందుబాటులో ఉంచాలని సూచించారు. దీంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే స్పెషలిస్టు డాక్టర్లకు అవసరమైన చోట క్వార్టర్లను నిర్మించాలని సీఎం జగన్ ఆదేశించారు.
ఈ నెల 18న వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకూ వైద్యం ఉచితం కార్యక్రమం ప్రారంభించనున్నారు. 19న ప్రతి నియోజకవర్గంలో 5 గ్రామాల చొప్పున జరిగే కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొనన్నారు. మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టున్నట్లు అధికారులు సీఎం జగన్ కు తెలిపారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ చేపట్టి జనవరి నెలాఖరు నాటికి కార్డుల పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వైయస్సార్ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా ఎలా వైద్యం పొందవచ్చన్నదానిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఏఎన్ఎం, సీహెచ్ఓ, ఆశావర్కర్లు, వాలంటీర్, మహిళా పోలీసులు ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ సహా, ఆరోగ్య శ్రీని ఎలా వినియోగించుకోవాలో అవగాహన పెంచే ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైయస్సార్ ఆరోగ్య శ్రీ యాప్ను డౌన్లోడ్ చేయించి ఎలా వినియోగించాలో వివరిస్తారని తెలిపారు.
జనవరి 1వ తేది ఫేజ్%--%2 ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతివారం మండలానికి ఒక గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అర్బన్ ప్రాంతాల్లో వారంలో ఒక వార్డులో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించాలని, జిల్లాల్లో సగం మండలాల్లో మంగళవారం, సగం మండలాల్లో శుక్రవారం, అర్బన్ ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించాలని సూచించారు. దీంతో పాటు ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవలు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. స్క్రీనింగ్, మందులు, చికిత్స తదితర అంశాల్లో కిడ్నీ రోగులకు బాసటగా నిలవాలన్నారు. డయాలసిస్ పేషెంట్లు (సీకేడీ) వాడుతున్న మందులు విలేజ్ హెల్త్ క్లినిక్స్లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఫ్యామిలీ డ్యాక్టర్ కాన్సెప్ట్తో అనుసంధానం చేసి మార్కాపురంలో కూడా పలాస తరహా వైద్య చికిత్సా సౌకర్యాలు అందుబాటులోకి రావాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలో ఇప్పటికే నెఫ్రాలజీ డిపార్ట్మెంట్ కోసం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, దీంతో పాటు యూరాలజీ డిపార్ట్మెంట్ కూడా తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు.





# పనులే మొదలు పెట్టని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 13:
నంద్యాల నూనెపల్లెలో రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తామని రెండు కోట్ల రూపాయల నిధులు వచ్చాయని ఎంపీ మరియు ఆయన అనుచరులు తెలియజేసినారు. రెండు నెలల్లో పని పూర్తి అవుతుంది అన్నారు కానీ నేటి వరకు పని పూర్తి కాలేదు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేసినప్పుడు కూడా రెండు నెలలు అని తెలియజేసినారు. ఆ తర్వాత మరల రెండు నెలలు అన్నారు ఇప్పటివరకు ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు ఇది నంద్యాల ఎంపీ ప్రజలకు మోసం మాటలు చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపించిన ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి నంద్యాల విద్యావంతులు కూడా నిధులు మంజూరైన ప్రారంభమైంది అని తెలియజేసిన వెంటనే చప్పట్లు కొట్టడం బ్రహ్మాండమైన అభివృద్ధి అని చెప్పడం జరుగుతుంది కానీ వాస్తవాలు గమనించి రైల్వే అధికారులను ద్వారా తెలుసుకొని పొగడ్తలు చేస్తే బాగుంటుందని మస్తాన్వలి తెలిపారు.

## సంపాదకీయం

## నిరుద్యోగులకు భరోసా కలిగించే చర్య !

బుధవారం 13-12-2023

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్‌లైన్‌కు ఆకర్శితులై తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఆత్మలు గత పదేళ్లుగా ఘోషిస్తున్నాయి. బతికున్న నిరుద్యోగులు ఉద్యోగాలు లేకుండా పొట్ట చేత పట్టుకుని నానా యాతన పడుతున్నారు. సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరవాత ఒక్కో రంగంపై సమీక్షిస్తూ సాగుతున్న తీరువల్ల ప్రజల్లో నమ్మకం కలుగుతోంది. ప్రధానంగా ఉద్యోగ నియామకాలు, ప్రైవేట్ ఫీజుల దోపిడీ, స్కూళ్ల మూసివేత వంటి వాటిపై చర్యలు తీసుకోవాలి. అలాగే నీళ్లు ఎవరికి పోయాయో గుర్తించాలి. కాళేశ్వరం పొడుగునా నీళ్లు ఎవరి పొలాలకు పారుతున్నాయో గుర్తించాలి. నియామకాలు ఎవరికి జరిగాయో..నిధులు ఎక్కడికి పోయాయో కూడా గుర్తించాలి. అప్పుడే తెలంగాణకు న్యాయం జరుగుతుంది. అమరుల ఆత్మలు శాంతిస్తాయి. ఈ క్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎస్‌పీఎస్సీని సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం యూపీఎస్సీతో పాటు ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించి సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు నిరుద్యోగులకు ఆశాజనకంగా మారింది. ఇదొక్కటే కాకుండా గత పదేళ్లుగా లక్షన్నర ఉద్యోగాలు భర్తీ చేశామని బుకాయించిన కెసిఆర్ ప్రభుత్వం ఎక్కడెక్కడ ఏ ఉద్యోగాలు భర్తీ చేసిందో నిజాలు రాబట్టాలి. నిరుద్యోగులకు సంబంధించి తీసుకునే ఎలాంటి నిర్ణయమైనా తెలంగాణ యువతకు భరోసా కల్పించేదే. గత పదేళ్లుగా డిఎస్సీలు కూడా నిర్వహించకుండా స్కూళ్లను మూసేసారు. దీనిపైనా విచారణ జరపాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో పాటు.. అవకతవకలకు కారకులైన వారిని గుర్తించి బోనులో నిలబెట్టాలి. అలాగే సర్వీస్ కమిషన్ ద్వారా ఏటా జాబ్ క్‌ఆయలెండర్ విడుదల చేసేలా దానిని సంస్కరించాలి. అర్హులైన వారికే పదవులు కట్టబెట్టి సమర్థతను పెంచాలి. యూపీఎస్సీతో తరహాలో దీనిని పటిష్ట సంస్థగా తీర్చిదిద్దాలి. అక్రమాలకు తావులేకుండా పక్కా ప్రణాళిక అమలు చేస్తే..మంచిది. ఇకపోతే గతంలో ఘంటా చక్రపాణి కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో కొన్ని ఉద్యోగాల్లో కవిత ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపైనా విచారణ చేయాలి. కమిషన్ ద్వారా ఉద్యోగ నియామకాలు అత్యంత పారదర్శకతతో చేపట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం ద్వారా నిరుద్యోగులకు భరోసా కల్పించాలి. అలాగే ఛైర్మన్, సభ్యుల నియామకాలను సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంది. కమిషన్‌కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, కావాల్సిన సిబ్బంది, ఇతర సదుపాయాలను వెంటనే కల్పించాలని అధికారులను సిఎం ఇప్పటికే ఆదేశించారు కనుక ఈ విషయంలోనూ నిరుద్యోగులు భరోసాతో ఉండ వచ్చు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించి జరిగిన అవతవకలపై సమగ్ర విచారణ జరపాలి. ఇకపోతే గత ప్రభుత్వ హయాంలో ఇంటర్, పది పరీక్షల నిర్వహణ కూడా భ్రష్టు పట్టిపోయింది. ఈ విషయంలో వచ్చిన ఆరోపణలపైనా సిఎం రేవంత్ సమీక్షించి విచారణకు ఆదేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం. త్వరలో జరుగనున్న పదోరగతి, ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీలు, ఇతర ఇబ్బందులను గుర్తించి పరీక్షల సమయం లో విద్యార్థులు ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా ఉండే విధంగా సాఫీగా పరీక్షలు నిర్వహించాలని సీఎం ఆదేశించినందున అధికారులు కూడా అందుకు తగ్గట్లుగా పనిచేయాలి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్

రంగంలో పనిచేస్తున్న విశ్వ విద్యాలయాల పనితీరుపై సవివరమైన నివేదిక అందచేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విశ్వ విద్యాలయాల పనితీరుపై సవివరమైన నివేదికతోపాటు, రాష్ట్రంలో ఎక్కడ జూనియర్ కళాశాలలు అవసరం ఉన్నాయో వాటి వివరాలు వెంటనే సమర్పించాలని కోరారు. ప్రధానంగా బాలికల కోసం జూనియర్ కళాశాలలు ఎక్కడ అవసరమో పరిశీలించి వాటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ప్రైవేట్ కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపైనా దృష్టి సారించాల్సి ఉంది. లక్షల్లో ఫీజుల వసూళ్లను నియంత్రించాలి. పేద,మధ్య తరగతి ప్రజలకు పాఠశాల విద్యనఉ చేరువ చేసేలా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో అంచనాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆరు గ్యారంటీలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడంతో ఆ విజయం లభించింది. అందుకే ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఆర్థికంగా బలపడేలా చూసుకోవాలి. ఆర్థిక దుబారాను అరికట్టడంతో పాటు, అధికారుల అవినీతిపైనా నిగ్గు తేల్చాలి. ఇవన్నీ ఒక్కొక్కటిగా చేసుకుంటూ పోతేనే సమర్థత బయటపడగలదు. సమగ్ర దర్యాప్తుతోనే అవినీతి బయటపడగలదు. ఇప్పటికిప్పుడు కొత్తగా ఆలోచించుకుని సంపద సృష్టించుకుని వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకుని హామీలు అమలు చేయాల్సి ఉంటుంది. మేనిఫెస్టోలో పెట్టిన ఇతర హామీలు సంగతేమో కానీ.. ఆరు గ్యారంటీలను మాత్రం వంద రోజుల్లోనే అమలు చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడా అభివృద్ధి పనుల గురించి ఆలోచించాల్సిన పరిస్థితి ఉండదు. అందుకే తెలంగాణలో అభివృద్ధిపై సమర్థంగానే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్ హామీలకు ఏటా 70వేల కోట్లు

### - దుబరా పథకాలను సమీక్షించుకుంటేనే సాధ్యం - సమర్థంగా పథకాలను పట్టాలకు ఎక్కించాల్సిందే

హైదరాబాద్,డిసెంబర్13 :
కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఏటా 70వేల కోట్ల వరకూ ఖర్చు అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు రైతు భరోసాకు 11,000 కోట్లు అవసరమని అంచనా. అందులో సగం కూడా నిధులు కూడా ప్రస్తుతం ఖజానాలో లేవని అధికారులు చెబుతున్నారు. ఉన్నంత వరకూ పాత పద్దతిలోనే జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు, ప్రభుత్వ భూముల అమ్మకంతో వచ్చిన డబ్బులు 19 వేల కోట్ల వరకు గత సర్కార్ ఖర్చు చేసేసింది. మద్యం టెండర్లను కూడా ముందే పూర్తి చేసి, తద్వారా వచ్చిన రాబడిని కూడా గత ప్రభుత్వమే ఖర్చు చేసింది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన అప్పులన్నీ మరో నాలుగు నెలలు మిగిలి ఉండగానే వాటినీ వాడేసింది. ఈ క్రమంలో ఆర్థిక క్రమశిక్షణ చాలా ముఖ్యం. అలాగే ఇప్పటి వరకు సాగిన దుబారా పథకాలను నిలుపుదలచేయాలి. ఇవన్నీ చేయకుంటే ఆరు గ్యారెంటీలను అమలు చేయడం కూడా కష్టమే. ఇప్పుడు అధికారం చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి వీటిని కట్టడి చేయకుంటే.. మరింత ఆర్థిక సంక్షోభం తప్పదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. ఖాజానా ఖాళీగా ఉంది. ఎదురుగా కొండంత అప్పులు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు అమలు చేయాల్సిన పథకాలు ఇప్పటికే సిద్దంగా ఉన్నాయి. అందుకే రేవంత్ రెడ్డి అసలైన సవాల్ ను ఆర్థిక పరిస్థితుల ఆధారంగా నే ఎదుర్కొంటున్నారు. ఆదాయాన్ని ముందుగానే ఖర్చు చేసేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి ఖాళీ చిప్ప ఇచ్చింది. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రెండు గ్యారంటీల అమలు ప్రారంభించింది. అయితే ఇప్పటికిప్పుడు ఆ భారం ప్రభుత్వంపై పడదు. కానీ ఆర్టీసికి రేపు అయినా చెల్లించాల్సిందే. ఇక ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న హామీ దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో ఓ ఆశ రేకెత్తించింది. గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్న జనమే ఇందుకు నిదర్శనం. రైతు భరోసా, రైతు కూలీలకు ఇస్తామన్నవి తప్పనిసరిగాఈ ఏడాదిలోనే ప్రారంభించాలి. ఐదేళ్లలో 15 లక్షల ఇళ్లు , యువ వికాసానికి రెండు లక్షల మంది విద్యార్థులకు చొప్పున ఖర్చు, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు ఇవన్నీ వేల కోట్లు ఖర్చయ్యే పథకాలే. చేయూత కింద 4000 పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చారు. వీటిని అమలు చేయడానికి పెద్దగా సమయం కూడా లేదు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో బడ్జెటేతర రుణాలతోపాటు ప్రభుత్వం 76 వేల కోట్ల అప్పుల్లో ఉండగా పదేళ్లలో బీఆరెస్ ప్రభుత్వం చేసిన 5.3 లక్షల కోట్ల అప్పులు తోడయ్యాయి. నేరుగా తీసుకున్న అప్పులే 3.59 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇక వివిధ కార్పొరేషన్లు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు 1.29 లక్షల కోట్ల వరకు ఉన్నాయి. ఆయా కార్పొరేషన్ అప్పులపై 10 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. వడ్డీల కోసమే కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితి రాష్ట్ర ఖజానాకు ఎదురవుతున్నది. మొత్తంగా వడ్డీలకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1700 కోట్లు చెల్లించాల్సి వస్తుందని అంచనా. సగటున రాష్ట్ర ఆదాయం 10,000 కోట్లుగా ఉంటే ఖర్చు ప్రతి నెలా 13 వేల కోట్లుగా కనిపిస్తున్నది. తెలంగాణలో ఉద్యోగులకు 3,115 కోట్లు.. పెన్షనర్లకు చెల్లించేందుకు 1450 కోట్లు ప్రతినెల అవసరం. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ జాబ్ క్యాలెండర్ మేరకు చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో ద్వారా ప్రకటించింది.ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టు కోసం కార్పొరేషన్ల వద్ద రూ. 85265 కోట్ల రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ఏటా కాళేశ్వరానికి 25,109 కోట్లు చెల్లించాల్సి ఉంది. నెలకు 2100 కోట్లు అవసరం. అలాగే తెలంగాణ విద్యుత్ సంస్థల అప్పులు 85 వేల 500 కోట్లుగా ఉన్నాయి. ప్రభుత్వం విద్యుత్తు సంస్థలకు 28,140 వేల కోట్ల బాకీ పడింది. మరో 12,515 కోట్ల ట్రూ అప్ చార్జీలు సైతం రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడింది. ఆ రెండింటినీ కలిపితే డిస్కంలకు ప్రభుత్వం 40,650 కోట్ల బకాయిలు పడింది. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఎత్తిపోతల పథకాల కరెంటు బకాయిలు 103 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఇక మిషన్ భగీరథ అమలుకు వాడిన కరెంటు బకాయిలు 3559 కోట్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జలమండలి బకాయిలు 3932 కోట్లుగా ఉన్నాయి. అంతా కలిపి ప్రభుత్వపరంగా విద్యుత్తు సంస్థలకు 28,861 కోట్ల బకాయిలు ఉన్నాయి. మరో వైపు ఆదాయం మాత్రం ఆశించినంతగా పెరగడం లేదు. బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి నాటికి మొత్తం రెవిన్యూ 2.16 లక్షల కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటికే లక్ష 15 వేల కోట్లు వచ్చాయి. ఇంకా మిగిలిన నాలుగు నెలల్లో లక్ష కోట్ల రూపాయలు రావాలి. ఆదాయం కూడా ఎన్నికల నేపథ్యంలో తగ్గిపోయింది. ప్రధానంగా ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, జీఎస్టీ, లిక్కర్ ద్వారా ఆదాయం సమకూరుతుంది. 2,300 కోట్ల ఆదాయం ప్రతినెల లిక్కర్ సేల్స్ ద్వారా వస్తుందని అంచనా. స్టాంప్స్ అండ్ డ్యూటీ రిజిస్ట్రేషన్ నవంబర్ నెల కొరకు 12 వేల కోట్లు రావాల్సి ఉండగా అది కూడా 9500 కోట్లు మాత్రమే వచ్చింది. జీఎస్టీ 51 వేల కోట్ల లక్ష్యానికి గాను నవంబర్ నాటికి 30 వేల కోట్లలోపే వచ్చింది. మార్చి చివరకు మరో 20 వేల కోట్లు రావాల్సి ఉంది.

# ఎపిలో అధికారం కోసం కాంగ్రెస్ ఎత్తులు

### ప్రత్యేకహోదాతో పాటు విభజన హామీలపై ఫోకస్
### సమర్థ నేత ఉంటే కాంగ్రెస్ నావను నడపవచ్చన్న అభిప్రాయం

అమరావతి,డిసెంబర్13
తెలంగాణ ఎన్నికలు ముగిశాక..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత ప్రజల్లో కూడా ఆలోచన వస్తోంది. ఎపిలో కాంగ్రెస్ మాత్రమే ఇచ్చిన హామీలు అమలు చేయగలదన్న భరోసా ఉంది. అక్కడ పాలనా, అక్కడి రాజకీయాలు భిన్నంగా మారిపోయాయి. ఇప్పుడు అందరి దృష్టి ఏపీపై పడింది. ఏపీలో ఎవరు గెలుస్తారన్న అంచనాలు ఎవరికి వారు వేసుకుంటున్నారు కానీ.. ఎవరూ ఊహించని విధంగా ఈ సారి కాంగ్రెస్ పార్టీ ప్రయోగం చేయబోతోందని జోరుగా ప్రచారం జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలని అడగడం ప్రారభించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీ వేదికగా ఎపికి ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించారు. తమవంతుగా పోరాడుతామని అన్నారు. అదే సమయంలో తాము వస్తే ఏపీకి ప్రత్యేకహోదా ఖాయమని రాహుల్ గాంధీ గతంలోనే ప్రకటించారు. కానీ కాంగ్రెస్ రావాలంటే పార్టీని నడిపించేవారు కావాలి. తెలంగాణలో రేవంత్ లాగా పార్టీని విజయతీరాలకు చేర్చే నేత అక్కడ కానరావడం లేదు. అలాంటి నేత కోసం కాంగ్రెస్ అన్వేషిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. కర్నాటక తరవాత తెలంగాణలో లభించిన విజయంతో కాంగ్రెస్ పార్టీకి దక్షిణాదిలో మరింత ఊపు వచ్చింది. బీజేపీ చేతిలో ఉన్న కర్ణాటక రాష్టాన్ని పోగొట్టుకుంటే... అసాధ్యమనుకున్న విజయాన్ని కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో సాధించింది. ఇప్పుడు ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ మీద దృష్టి పెట్టే అవకాశం ఉంది. వైఎస్ కుమారుడు జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ పెట్టుకోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ మొత్తం ఆ పార్టీ వైపు మళ్లింది. ఇప్పుడు ఆ ఓటు బ్యాంక్ ను కాంగ్రెస్ వైపు రప్పించుకోవాలన్న ప్రణాళిక కాంగ్రెస్ అమలు చేస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. వైసిపి, బిజెపి ఒక్కటే అన్న ప్రచారం కూడా ఉంది. తెలంగాణలో లాగా ఇక్కడా లోపాయకారిగా ఈ రెండు పార్టీలు కలసి పనిచేస్తున్నాయన్న ప్రచారం ఉంది. అందుకే విభజన హామీలు గాలికి వదిలారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే విశాఖ స్టీల్ లాంటి ఉక్కు పరిశ్రమను అమ్మకానికి పెట్టడం కూడా ప్రజలు జీర్ణించుకోవడం లేదు, వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అయిన కేవీపీ రామచంద్రరావు ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. ఆయన ఇప్పుడు ఎపిలో కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు తీసుకుని రావాలని పాటుపడుతున్నారు. అంతర్గత సంభాషణల్లో షర్మిల ఏపీలో కాంగ్రెస్ సారథ్యం వహిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు షర్మిల ఏపీలోపార్టీ బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. మాజీ ఎంపీ చింతామోహన్ కూడా అదే చెబుతున్నారు. అయితే షర్మిల ఇప్పటికీ కాంగ్రెస్ లో లేరు. అన్న జగన్మోహన్ రెడ్డితో విబేధాలు వచ్చాయో... లేక రాజకీయ వ్యూహమో కానీ షర్మిల తెలంగాణ రాజకీయాల్లో అదృష్టం పరీక్షించుకోవాలని వచ్చి...ఏమీ చేయకుండానే మిన్నకున్నారు. మూడు వేల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేశారు. కానీ ప్రయోజనం లేకపోయింది. తెలంగాణ ప్రజలు ఆమెను ఓన్ చేసుకోలేకపోయారు. అందుకే వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పార్టీలో విలీనమవ్వాలనుకున్నారు. కానీ ఆమె చేరిక బీఆర్ఎస్ కు ఆయుధం ఇచ్చినట్లుగా అవుతుందని చెప్పి రేవంత్ రెడ్డి అడ్డుకున్నారని అంటారు. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ రాజకీయం అంతా రేవంత్ చుట్టే తిరుగుతోంది. దీంతో ఇప్పుడు షర్మిలకు తెలంగాణ రాజకీయాల్లో చోటు లేదనే భావించాలి. షర్మిల రాజకీయ భవిష్యత్ ను సీరియస్ గా తీసుకుంటే ఆమె కాంగ్రెస్ పార్టీలో విలీనమయి.. ఏపీ లో రాజకీయం చేయడం ఒక్కటే మార్గం. అయితే అన్న జగన్‌కు వ్యతిరేకంగా ఆమె రాజకీయాలు చేస్తారా అన్నది కూడా ముఖ్యమే. అన్నతో నిజంగానే విభేదాలు ఉన్నాయా అన్నది కూడా తెలుసుకోవాల్సి ఉంది. ఇకపోతే ఏపీ పీసీసీ చీఫ్ గా సమర్థులు ఎవరైనా బాధ్యతలు తీసుకుంటే.. కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చే ఛాన్స్ ఉందన్న నమ్మకం పార్టీలో ఉంది. రాష్ట్ర విభజన వల్లనే ఏపీలో కాంగ్రెస్ చతికిలపడింది. విభజన హామీలు నెరవేర్చగలుగుతామన్న గట్టి హామీ దక్కితే ప్రజలు మళ్లీ కాంగ్రెస్‌ను ఆదరించవచ్చు. ప్రజలను తమవైపు తిప్పుకోగల జనాకర్షక నేత వస్తేనే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం దిశగా మొదటి అడుగు పడుతుంది. ఏపీకి ప్రత్యేకహోదా నినాదంతో కాంగ్రెస్ అడుగు పెడితే రాజకీయాల్లో కీలక మార్పులు రావచ్చని అంటున్నారు.

# పంథా మార్చిన బిజెపి

### - వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహం - మూడు రాష్ట్రాల సిఎంల ఎంపికలో రాజకీయ చతురత

న్యూఢిల్లీ,డిసెంబర్13
ఎన్నికల సీజన్ ఇంకా ముగిసిపోలేదు. పారల్మెంట్ ఎన్నికలు ముందున్నాయి. ఈ క్రమంలో అనూహ్యంగా బిజెపి పెద్ద అడుగే వేసింది. మూడు రాష్ట్రాల్లో పాతకాపులను కాదని ముగ్గురు కొత్త సిఎంలను తెరపైకి తెచ్చింది. ఇది ఓ ర కంగా సాహసోపేతమైన నిర్ణయంగానే భావించాలి. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు అన్ని పార్టీలూ ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటు న్నాయి. మొన్నటి ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మొత్తం మూడు రాష్ట్రాలనూ తమ ఖాతాలో వేసుకుంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో భారీ మెజార్టీ సాధించింది. అంత కన్నా ముందు ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించడం. ఎప్పుడూ ఈ విషయంలో ముందుగానే క్లారిటీగా ఉండే బీజేపీ ఈ సారి మాత్రం ఎందుకో కాస్త సమయం తీసుకుంది. ఫలితాలు విడుదలయ్యాక వారం రోజులకు గానీ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను ప్రకటించలేదు. నిజానికి మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్‌లో వసుంధర రాజే ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్ సింగ్‌కి పోటీలో ఉన్నారు. వీళ్ల ముగ్గురికే కచ్చితంగా మరోసారి అవకాశం వస్తుందని అంతా భావించారు. కానీ..అలా జరగలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన ఎన్నికలు కావడంతో ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయించు కుంది. దాదాపు వారం రోజుల పాటు మేధోమథనం చేసిన తరవాత మూడు రాష్ట్రాలకూ ముగ్గురు కొత్త వ్యక్తులకు సీఎం పదవిని కట్టబెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎంతో అనుభవం ఉన్న సీనియర్లను పక్కన పెట్టి బీజేపీ తీసుకున్న నిర్ణయంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. రాజస్థాన్‌లో మొన్నటి వరకూ కాంగ్రెస్ అధికారంలో ఉంది. అశోక్ గహ్లోట్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. సంక్షేమ పథకాలు తమను కాపాడతాయని భావించినా అది పెద్దగా సాయపడలేదు. అంతర్గత విభేదాలతో పాటు మరి కొన్ని సమస్యలు ఓటర్లను బీజేపీ వైపు మళ్లేలా చేశాయి. ఇక్కడ మెజార్టీ సాధించింది కాషాయ పార్టీ. బీజేపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా వసుంధర రాజేనే ముఖ్యమంత్రి అవుతారని అంతా అనుకున్నారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన భజన్ లాల్ శర్మని ముఖ్యమంత్రిని చేయడమే అందరికీ షాక్ కలిగించిన విషయం. భజన్ లాల్ శర్మ బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన వ్యక్తి. ఇక డిప్యూటీ సీఎంలుగా రాజ్‌పూత్, దళిత వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల్ని ఎంపిక చేసుకుంది. మొత్తంగా రాష్ట్రంలోని కీలకమైన మూడు వర్గాలకూ న్యాయం చేసింది. భజన్ లాల్ శర్మ ప్రధాని మోదీకి అత్యంత సన్నిహుతుడు. అంతే కాదు. బిజెపి భావజాలాన్ని బలంగా నమ్మే వ్యక్తి. ముందు నుంచి హైకమాండ్‌తో విధేయంగా ఉన్న వ్యక్తి కూడా. అలాంటి వ్యక్తికి పదవినిస్తే తమ విలువలను, పార్టీ సిద్ధాంతాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశముంటుందని బీజేపీ భావించింది. ఇక మధ్యప్రదేశ్ విషయానికొస్తే... శివరాజ్ సింగ్ చౌహాన్ లేని బీజేపీని అక్కడ ఊహించలేం. దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనను కాదని మోహన్ యాదవ్ అనే కొత్త వ్యక్తికి సీఎం కుర్చీని కట్టబెట్టింది. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్ యాదవ్..ఓ సారి మంత్రిగానూ పని చేశారు. అనుభవ పరంగా చూసుకుంటే శివరాజ్ సింగ్ చౌహాన్ కన్నా తక్కువే. బ్రాహ్మిణ్, ఎస్‌సీ వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు డిప్యూటీ సీఎం పదవులు కట్టబెట్టింది. ఇప్పుడు మోహన్ యాదవ్ హయాంలో రాష్ట్రం ఎలా ఉండనుందన్న ఆసక్తి నెలకొంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ గతంలో రమణ్ సింగ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆ నేతను కాదని విష్ణు దేవ్ సాయ్‌కిఅవకాశమిచ్చింది అధిష్ఠానం. గతంలో ఆయన కేంద్ర మంత్రిగా పని చేశారు. ఛత్తీస్‌గఢ్ బీజేపీ ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ అనుభవం ఒక్కటే చూడలేదు బీజేపీ. ఆయన వర్గాన్నీ లెక్కలోకి తీసుకుంది. ఆయన గిరిజన తెగకు చెందిన వ్యక్తి. ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కువ జనాభా గిరిజనులదే. వాళ్ల ఓటు బ్యాంకుని కాపాడుకోవాలంటే ఆ వర్గానికే చెందిన వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలని వ్యూహాత్మకంగా ఆలోచించింది. అందుకే..ఆయనకే ఆ పదవి ఇచ్చింది. ఇప్పటికే గిరిజన తెగకు చెందిన ద్రౌపది ముర్ముకి రాష్ట్రపతి పదవిని కట్టబెట్టింది. ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు కూడా బీజేపీ ఐడియాలజీకి చాలా దగ్గరగా ఉండే వ్యక్తులే. అయోధ్య రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దుపై పెద్ద ఎత్తున ప్రచారం చేసిన వాళ్లే. ఇలాంటి వ్యక్తులకు తమ పార్టీలో కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుందన్న సంకేతాలిస్తూ ఇలా నిర్ణయం తీసుకుంది హైకమాండ్. ఇదంతా ప్రధాని మోదీ, అమిత్‌షా వ్యూహం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. లోక్‌సభ ఎన్నికల ముందు సరిగ్గా ఓటర్ల పల్స్ పట్టుకోవడంతో పాటు కుల సమీకరణలతో మిగతా పార్టీలకు సవాల్ విసిరింది.